హుజూరాబాద్‌ను సిద్దిపేటలా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి
- బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి



గులాబీ కుండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: ఎమ్మెల్యేగా అవకాశమిస్తే రూ.వెయ్యి కోట్లతో హుజూరాబాద్‌ను సిద్దిపేటలా తీర్చిదిద్దుతానని బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్ద పాపయ్యపల్లి, చిన్న పాపయ్యపల్లి, కాట్రపల్లి, దమ్మక్కపేట, ఇప్పల నర్సింగాపూర్ గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం జరిగింది. ఈసందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. జమ్మికుంట ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ హుజూరాబాద్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారని, ప్రజలు గమనించి బీఆర్‌ఎస్‌కు అవకాశం కల్పించాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా పథకాలు అమలు చేస్తూ రైతుల గుండెల్లో గుడి కట్టుకున్న మహానీయుడు కేసీఆర్ అని, అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పార్టీ బృహత్తర మేనిఫెస్టోను ప్రకటించిందన్నారు. ఉపఎన్నికల సమయంలో సెంటిమెంట్ డైలాగులతో నియోజకవర్గంలో ఓట్లు వేయించుకొని కనీసం గెలిచిన తర్వాత రెండున్నరేళ్ల కాలంలో ఈటల ఒక్కసారైనా నియోజకవర్గానికి వచ్చి ప్రజల బాధలను పట్టించుకోలేదన్నారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించినా ఈటల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దకు వెళ్లి హుజూరాబాద్ అభివృద్ధి కోసం రూ.1,000 కోట్లు తీసుకువస్తానన్నారు.

కొంగుపట్టి అభ్యర్థించిన కౌశిక్‌రెడ్డి సతీమణి

హుజూరాబాద్ నియోజకవర్గంలో ఉంటూ ప్రజాసేవ చేసుకుంటున్నాం, మా కష్టాన్ని గుర్తించాలని, ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కౌశిక్‌రెడ్డి సతీమణి శాలిని దండం పెడుతూ, కొంగుపట్టి అభ్యర్థించారు. గెలిచిన తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయించే బాధ్యత తీసుకుంటామన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో వీణవంక మండలం కోర్కల్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కౌశిక్‌రెడ్డి కుండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతం, విజయానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కౌశిక్ రెడ్డి కోరారు. పార్టీలో చేరినవారిలో సుమారు 200 మంది ఉన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి, కోర్కల్ సర్పంచ్ మరిస్వామి, ఎంపీటీసీ సమ్మయ్య, గ్రామ అధ్యక్షుడు రాకేశ్, నరసింగపల్లి సర్పంచ్ కోమల్ రెడ్డి, నాయకులు తంబాల సమ్మయ్య, శంకర్, బాసుమియా, మునీర్, అంకుస్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు

- కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల ప్రణవ్



పోతిరెడ్డిపేటలో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్



కమలాపూర్: కన్నూరులో..

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట/కమలాపూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని, బీఆర్‌ఎస్, బీజేపీలను నమ్మితే అంతే సంగతులని హుజూరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి వొడితెలప్రణవ్ అన్నారు. హుజూరాబాద్‌రూరల్ మండలంపోతిరెడ్డిపేట, వెంకట్రావ్‌పల్లి, సిర్సపల్లి, రాంపూర్, జూపాక, బోత్తలపల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధి కారంలోకి వచ్చిన వందరోజుల్లోనే హామీలు అమలు చేస్తామన్నారు. రూ. వెయ్యికోట్లతో హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానంటున్న ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఎవరు ఆపారని ప్రశ్నించారు. రెండు దశాబ్దాలుగా గెలిచిన ఈటల రాజేందర్ చేసిన అభివృద్ధి ప్రజలకు తెలియజేయాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

సింగాపూర్ గ్రామంలోని వొడితెల ప్రణవ్‌నివాస గృహంలో ఆయా మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ప్రణవ్ కుండవాలు కప్పి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు కిరణ్, నాయకులు, తదితరులు ఉన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌ది లోపాయికార ఒప్పందం

బీఆర్‌ఎస్, బీజేపీ లోపాయికార ఒప్పందంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. వీణవంక మండల అధ్యక్షుడు ఎండీ సాహెబ్ హుస్సేన్, వీణవంక మండల్ కిసాన్ సెల్ అధ్యక్షుడు చదువు జయపాల్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎదునూరి పైడికుమార్, నాయకులు జున్నోతుల మధుకర్, చింతల హరీశ్, ఎండీ అఫ్సర్, ఇల్లందకుంట మండల మహిళా అధ్యక్షురాలు కోడం రజిత ఉన్నారు.

ఆరు గ్యారంటీలపై ప్రచారం

జమ్మికుంట పట్టణంలోని ఎనిమిదో వార్డులో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై నాయకులు ప్రచారం నిర్వహించారు. మారుతినగర్‌లోని శ్రీపంచముఖ హన్‌మాన్ దేవాలయంలో గ్యారంటీ కార్డుల తోపాటు వొడితెల ప్రణవ్ గెలవాలని ప్రత్యేక పూజలు చేశారు.

ఓటేసి ఆశీర్వదించండి

సబ్బండ వర్గాలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని వొడితెల ప్రణవ్ అన్నారు. కమలాపూర్ మండలంలోని గుండేడు, కొత్తపల్లి, కన్నూరు, రాములపల్లి, భీంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సిద్ధించిన రాష్ట్రం.. కల్వకుంట్ల కుటుంబం చేతిలో బందీ అయ్యిందన్నారు. మాయమాటతో మరోసారి మోసం చేయాలని చూస్తుందని, ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ఈటల గజ్వేల్‌కు వెళ్లి గజ్వేల్ ముద్దు బిడ్డనని చెబుతున్నారని, హుజూరాబాద్ బిడ్డనా, గజ్వేల్ బిడ్డనా ప్రజలు ఆలోచించాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండపు చరణ్‌పటేల్, నాయకులు,పాల్గొన్నారు.

క్లుప్తంగా

తేమ లేని ధాన్యం తూకం వేయాలి



ధాన్యం తూకం వేస్తున్న మధుకర్ రెడ్డి

శంకరపట్నం: తేమలేని ధాన్యం తూకం వేయాలని తాడికల్ సహకార సంఘం చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కేశవపట్నం, తాడికల్‌లో వరిధాన్యం కేంద్రాలను శనివారం పరిశీలించారు. ధాన్యం తూకం వివరాలను రైతులతో పాటు హమాలీలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆరబెట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు.

నగదు, బియ్యం అందజేత

గంగాధర: మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందినవారి కుటుంబ సభ్యులకు టీఎల్ యువసేన సభ్యులు శనివారం ఆర్థికసాయం చేశారు. గ్రామానికి చెందిన కోల రాధ, దూస సతీశ్, కొలెపాక లక్ష్మణ్-మంజుల దంపతుల కుమారుడు మృతి చెందారు. ఒక్కో కుటుంబానికి రూ.ఐదువేలతో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు



తరలివెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రామడుగు: హైదరాబాద్‌లోని ఎమ్మార్పీఎస్ జాతీయ సమావేశానికి మండలం నుంచి పలువురు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు శనివారం తరలివెళ్లారు. ఈ సమావేశానికి హోంమంత్రి అమిత్ షా హాజరవుతారని తెలిపారు. వెళ్లినవారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు తడగొండ శంకర్, రాజయ్య ఉన్నారు.

గ్రామ దేవతలకు పూజలు



పూజలు చేస్తున్న అర్చకుడు

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్‌లో శనివారం గ్రామదేవతలకు పూజలు చేశారు. గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా అర్చకులు అభిషేకం, అర్చనలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ సదానందం, మురళీకృష్ణమాచార్యులు, గ్రామస్తులు సపాల్గొన్నారు.

'సెయింట్‌జార్జ్'లో గ్రాండ్ పేరెంట్స్ డే

కొత్తపల్లి: రేకుర్తిలోని సెయింట్‌జార్జ్ నినోస్ బ్లాక్ (సీబీఎస్ఈ)లో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. సెయింట్ జార్జ్, ప్యారడైజ్ విద్యా సంస్థల చైర్మన్ పి.ఫాతిమారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇన్‌చార్జి సంగీత, అధ్యాపకులు, విద్యార్థులు, గ్రాండ్ పేరెంట్స్ పాల్గొన్నారు.

ఓటరు స్లిప్‌లు పంపిణీ



చొప్పదండి: స్లిప్‌లు పంపిణీ చేస్తున్న శాంతికుమార్



రామడుగు: వెదిరలో బీఎల్‌వో అశోక్‌రెడ్డి

చొప్పదండి: ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకొని పోలింగ్ శాతం పెంచాలని మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ కోరారు. పట్టణంలోని మూడో వార్డులో శనివారం ఓటరు స్లిప్‌ల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా పలువురికి ఓటరు ఓటరు స్లిప్‌లు అందించారు. ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా ఉండేందుకు నేరుగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ డి. ప్రశాంత్ కుమార్, బీఎల్‌వోలు వసంత, చంద్రకళ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎల్‌వోలు ఇంటింటికీ తిరుగుతూ ఓటరు స్లిప్‌లు అందజేస్తున్నారు. 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు సూచిస్తున్నారు. ఓటరు లిస్టు ప్రకారం స్లిప్స్‌లు పంపిణీ చేస్తున్నామని బీఎల్‌వోలు తెలిపారు.

ముగిసిన కాంప్లెక్స్ సమావేశాలు



కోరపల్లిలో ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్



రామడుగు: శిక్షణ ఇస్తున్న సీఆర్‌పీ సంపత్‌రెడ్డి

జమ్మికుంట: పట్టణంలోని బాలుర, మండలంలోని కోరపల్లిలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో రెండు రోజులు తొలిమెట్టుపై అవగాహన కోసం ఉపాధ్యాయులకు నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశాలు శనివారంతో ముగిశాయని ఎంఈవో విడుపు శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని బాలుర పాఠశాలలో ఫిజిక్స్, కోరపల్లిలోని పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించమన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తొలిమెట్టుపై లక్ష్య సాధన శిక్షణ కార్యక్రమంలో సూచించిన అంశాలు, నిర్దేశించిన లక్ష్యాలను ఉపాధ్యాయులు తప్పకుండా పాటించాలన్నారు. పాఠ్య, పీరియడ్ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, పరిశీలకులు పాఠశాలను సందర్శించిన క్రమంలో రికార్డులు చూపించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సమ్మయ్య, మండల నోడల్ అధికారి పద్మ, ఆర్పీలు కిషన్‌రెడ్డి, ఉమాదేవితో మూడు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

వీణవంక: పదిలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీణవంక, ఇల్లందకుంట, జమ్మికుంట మండలాల ఉపాధ్యాయులతో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. తొలిమెట్టులో భాగంగా ఎఫ్ఎల్ఎస్ శిక్షణ కార్యక్రమాలను అమలు పరచడంలో ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని, డిసెంబర్‌లో రాష్ట్ర, జిల్లా అధికారులు కార్యక్రమాలపై నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్లు తిరుపతిరెడ్డి, కరుణాకర్, బాలాజీ, ఉన్నారు.

హిందీ టీచర్లకు శిక్షణ

రామడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం రామడుగు, గంగాధర మండలాల హిందీ ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. సమావేశంలో సీఆర్‌పీలు సంపత్ రెడ్డి, ఇర్షాద్ ఉపాధ్యాయులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ శిబిరాన్ని రాష్ట్ర పర్యవేక్షణ సిబ్బంది పరిశీలించారు. కార్యక్రమం హెచ్‌ఎం పద్మజ అధ్యక్షతన నిర్వహించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలి

వీణవంక: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్ అన్నారు. మండలంలోని బేతిగల్ గ్రామంలో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు పాటించాలని, స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ఆసిఫ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎనిమిది మంది బైండోవర్

జమ్మికుంట: తహసీల్దార్ రజని ఎదుట ఎనిమిది మందిని బైండోవర్ చేసి కేసు నమోదు చేశామని టౌన్ సీఐ బార్పటి రమేశ్ శనివారం తెలిపారు. పట్టణంలోని పలు వార్డులకు చెందిన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులను ఎన్నికల నియమావళిలో భాగంగా ఏలాంటి అవంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు.

ఝాన్సీలక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

కరీంనగర్‌కల్చరల్: రాజ్య ప్రజలందరినీ బ్రిటిష్ మూకల నుంచి కాపాడుకునే దిశగా అలుపెరుగని పోరాటం చేస్తూ ప్రాణాలకు తెగించిన వీర వనిత ఝాన్సీలక్ష్మీబాయిని మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచారక్ అమిరిసేని సందీప్ అన్నారు. శనివారం లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకొని నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడారు. ఝాన్సీరాణి జీవితాన్ని ఎంతోమంది స్త్రీలు స్ఫూర్తిగా తీసుకొని ఆనాడు స్వాతంత్ర సమరంలో పాలుపంచుకున్నరని అన్నారు. ప్రతీ విద్యార్థి స్ఫూర్తిగా తీసుకొని ప్రస్తుతం జరుగుతున్న మహిళలపై అత్యాచారాలను ధైర్యంగా ఎదుర్కొని దేశ భవిష్యత్‌ను రూపుదిద్దించడంలో మహిళల పాత్ర ఎక్కువగా ఉండాలన్నారు. ఏబీవీపీ నాయకులు రాకేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విష్ణు, నగర కార్యదర్శి నందు, జోనల్ ఇన్‌చార్జిలు మధు అన్వేష్, అంజి ఉన్నారు

అసెంబ్లీలో ప్రజల గొంతు వినిపిస్తా..

- హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం



సీతారాంపూర్‌లో నృత్యం చేస్తున్న పొన్నం



కోహెడరూరల్: డప్పుకొడుతున్న పొన్నం

కోహెడరూరల్(హుస్నాబాద్): తనను గెలిపిస్తే అసెంబ్లీలో హుస్నాబాద్ గొంతు వినిపిస్తానని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని శనిగరం, గుండారెడ్డిపల్లె, తంగలపల్లి, కూరెల్ల, కొండేటిపల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పదేళ్లలో అసెంబ్లీలో సమస్యలపై ఎన్నిసార్లు మాట్లాడారని ప్రశ్నించారు. హుస్నాబాద్ ప్రజల కన్నీరు సీఎం నియోజకవర్గానికి సాగు నీళ్లుగా మారాయని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్, సామాజిక సేవకురాలు మంజులారెడ్డి, శంకర్, ధర్మయ్య, గోపి, జయరాజు, లక్ష్మణ్, పాల్గొన్నారు.

గౌరవెల్లి పూర్తి చేసి సాగునీరు అందిస్తాం..

అక్కన్నపేట/హుస్నాబాద్‌రూరల్: గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తామని పొన్నం అన్నారు. గోవర్ధనగిరిలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ప్రచారంలో మాట్లాడారు. డిసెంబర్ 9న ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, బైబై కేసీఆర్ అని ప్రజలు చెబుతున్నారన్నారు. గోవర్ధనగిరిని హుస్నాబాద్‌లో విలీనం చేస్తామని హామీ ఇచ్చారు. పొట్లపల్లిలో మాజీ ఎంపీటీసీ వెంకటస్వామి ఆధ్వర్యంలో నాయకులు ప్రచారం నిర్వహించారు.

'కాళేశ్వరం'లో రూ.వెయ్యి కోట్ల అవినీతి

చిగురుమామిడి: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో రూ.వెయ్యికోట్ల అవినీతి జరిగింది, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అవినీతి అక్రమాలపై విచారణ జరిపిస్తామని పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. పీచుపల్లి, సీతారాంపూర్, లంబాడిపల్లి, ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, చిగురుమామిడిలో సీపీఐ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఎనిమిది గ్రామాలకు కాళేశ్వరం జలాలు వచ్చాయని, గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు ఇవ్వలేకపోయారని, చిన్న ముల్కనూర్‌ను మినహాయిస్తే మిగిలిన గ్రామాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించలేదని, ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు. . డప్పుచప్పుళ్లు, లంబాడీ నృత్యాలతో కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొన్నారు. జెడ్పీటీసీ గీకురు రవీందర్, మండలశాఖ కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ముదిమాణిక్యం ఎంపీటీసీ, బీజేపీ నాయకుడు ఏలేటి రవీందర్‌రెడ్డి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బద్దం నర్సింహారెడ్డితోపాటు పోటు మల్లారెడ్డి, ముంజ నారాయణ, పలువురు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు.

రాష్ట్రాన్ని దోచుకుంటున్న 'కల్వకుంట్ల' కుటుంబం

- టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్



గన్నేరువరం: విజయభేరి సభకు హాజరైన ప్రజలు



మాట్లాడుతున్న అద్దంకి దయాకర్, కవ్వంపల్లి

గన్నేరువరం: తెలంగాణ ఉద్యమానికి ఊపునిచ్చి అక్కున చేర్చుకున్న కరీంనగర్ ప్రజలు బీఆర్‌ఎస్‌పై తిరగబడుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం రాత్రి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విజయభేరి సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గుండ్లపల్లి నుంచి మండలకేంద్రం వరకు ద్విచక్రవాహనాలతో భారీ ర్యాలీ చేపట్టారు. బీఆర్‌ఎస్‌కు మూడోసారి అధికారం ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. పేదలకు ఇళ్లు నిర్మించకుండా కోట్లు ఖర్చు పెట్టి సెక్రటేరియట్ నిర్మించారని, కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంటుందని ఆరోపించారు. విద్యార్థుల ఆత్మహత్యలతో చలించిన సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసిందని, చేతి గుర్తుకు ఓటు వేసి కవ్వంపల్లి సత్యనారాయణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రసమయికి ఓటమి ఖాయం

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను మానకొండూర్ ప్రజలు తిరస్కరిస్తున్నారని, ఓట్లతో ఓటమి రుచి చూపించడానికి సిద్ధమయ్యారని కవ్వంపల్లి అన్నారు. ఏడాది క్రితం డబుల్‌రోడ్ నిర్మాణానికి రూ.71 కోట్లు నిధులు వచ్చాయంటూ క్షీరాభిషేకాలు చేసుకున్నా ఎమ్మెల్యే పనులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కవ్వంపల్లి అనురాధ, ఎంపీపీలు సులోచన, వెంకటరమణారెడ్డి, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, అనంతరెడ్డి, బొడ్డు సునీల్, రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, అనిల్, మల్లేశం, రవీందర్ పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని లక్ష్మీపూర్ సర్పంచ్ తుమ్మల అర్చనభగవాన్‌రెడ్డితో పాటు మున్నూరుకాపు, కుర్మ సంఘం, యాదవ సంఘం, ముదిరాజ్, పద్మశాలీ, అంబేద్కర్ సంఘం నుంచి మూడు వందల మంది ఎంపీపీ ముద్దసాని సులోచనశ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కవ్వంపల్లి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవీంద్రచారీ, తిరుమల్‌రెడ్డి, గసికంటి సంపత్ ఎడ్ల భద్రయ్య, ఎడ్ల శ్రీదర్, మేకల సతీష్, గ్రామ శాఖ అధ్యక్షులు ఎడ్ల సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లు ఎదుర్కొనేందుకు సిద్ధమవ్వాలి



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

కొత్తపల్లి: విద్యార్థినులు భవిష్యత్‌లో వచ్చే సవాళ్లు ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి సూచించారు. కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం 'ఎంటర్‌ప్రైజ్ ఎక్స్‌ప్లోరేషన్-2023' పేరిట నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్లిష్ట పరిస్థితుల్లో వచ్చే సవాళ్లు, బృంద కార్యక్రమాల్లో సభ్యుల సహకారం, నాయకత్వ లక్షణాలు పటిష్ట పర్చుకునే విధానాలను హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్లు సుభా స్తేజ్, బాలాన్జి, చైతన్య, తిరుమల్ వివరించారు. విద్యార్థి దశ నుంచే అనుకున్న లక్ష్యాలపై దృష్టిసారించాలని అన్నారు. ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ బి.విజయలక్ష్మీ, జి.చంద్రశేఖర్‌రెడ్డి, బీడీఏ గ్రూపు హెచ్‌వోడీ గుండా శ్రీనివాస్, అధ్యాపకులు, మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

'బ్లూబెల్స్'లో బాలల దినోత్సవం

సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని హనుమాన్ నగర్‌లో గల బ్లూబెల్స్ పాఠశాలలో శనివారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణాన్ని అందంగా బెలూన్‌లతో ముస్తాబు చేశారు. విద్యార్థులందరూ రంగు రంగుల దుస్తులతో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించడం, ఉపాధ్యాయులు విద్యార్థులుగా మారి పాఠశాల అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించిన తీరు అలరించింది. వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ జంగ సునీతామనోర్‌రెడ్డితో పాటు ప్రిన్సిపాల్స్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన సంగెం బాలయ్య సాక్షి దినపత్రిక ఏజెంట్‌గా 8 ఏళ్లు పని చేశాడు. అనారోగ్య కారణాలతో నెలక్రితం మృతిచెందాడు. ఈసందర్భంగా అతడి కుటుంబానికి 'సాక్షి' సర్క్యులేషన్ సిబ్బంది అండగా నిలిచారు. తమవంతు సాయంగా రూ.24,000 నగదు శనివారం అందజేశారు. కార్యక్రమంలో సర్క్యులేషన్ మేనేజర్ ఆర్.మధుకర్‌రెడ్డి, సిబ్బంది బింగి రమేశ్, బొట్టు రవీందర్, చౌదరి పర్శరాములు, కత్తుల మొండయ్య తదితరులు పాల్గొన్నారు.